
## పెద్దకథ



కుమారి హరిత భరతనాట్య ప్రదర్శన।

రంగస్థలంమీద నృసింహావతార ఘట్టం అద్భుతంగా సాగిపోతున్నది

హిరణ్యకశిపుడు ప్రహ్లాదుడిని పాములతో కరిపించమనడం, ఏనుగులతో త్రొక్కించమనడం, సముద్రంలో పారవేయమనడం—హరి హరి అంటావా, హరి ఈ స్తంభమున కలడా అని, గదతో స్తంభాన్ని మోదగానే హరి నరహింహావతారం ఎత్తి, హిరణ్యకశిపుడి పొట్టచీల్చి ఉగ్రమూర్తిగా నిలవడం-చాలా అద్భుతంగా అభినయించింది హరిత.

కెమెరాలు క్లిక్ క్లిక్ మన్నాయి.

కరతాళధ్వనుల మధ్య తెరపడింది.

ప్రేక్షకులు పారవశ్యంతో లేచారు.

"చాలా చిన్న వయసులో గొప్ప ప్రావీణ్యం సంతరించుకుందా అమ్మాయి." పద్దెనిమిదేళ్ల హరిత మీద ప్రశంసల వర్షం కురుస్తోంది.

"ఆ అమ్మాయికి ఈ డాన్సేకాదు, శాస్త్రీయ సంగీతం కూడావచ్చు. పెయింటింగ్‌లో కూడా మంచి అభిరుచి వుంది। స్కూల్లో ఫస్టువస్తూనే ఇవన్నీ ఎలా నేర్చుకోగలిగిందా అని నాకెప్పుడూ ఆశ్చర్యంవేస్తూ ఉంటుంది. హరిత తల్లి నాకు క్లోజ్‌ఫ్రెండు। కూతుర్ని చూసి ఎంత గర్వపడతారో ఆమె విషయంలో అంతశ్రద్ధ తీసుకొంటారా తలిదండ్రులు। అన్నిట్లో ఆ అమ్మాయిని ఉత్సాహపరుస్తుంటారు..." ఉత్సాహంగా ఎవరికో చెబుతూన్న సుందరి ముందుకు దూసుకుపోయింది. "ఏయ్, హేమలతా!" అంటూ.

"... నిజంగా అలాంటి కూతుర్ని కన్నందుకు మీ జన్మ చరితార్థమైంది" అన్న ప్రేక్షకుల ప్రశంసలకి పులకింతల మధ్య ఉన్న హేమలతా, ఆమె భర్తా సుందరికేసి ఇటు తిరిగారు.

"అద్భుతం। మహాద్భుతం। హరిత ఏదో డాన్స్ క్లాసెస్‌కి అటెండ్ అవుతూందని తెలుసుగాని ఇంత గొప్పగా చేయగలదని అనుకోలేదు. అసలు అభినందించాల్సింది మీ ఇద్దరినీ. ఈ ప్రతిభ వెనుక మీ కృషి ఎంతైనా ఉంటుంది!" హేమలత చేతులు పట్టుకొని ఆనందంతో ఊపేస్తూ అంది సుందరి.

# చిత్రిలో సతి

"కృషి అంటూ పెద్దగా ఏంలేదు! ప్రోత్సాహం మాత్రమే మేం అందించాం. నాట్యంలో దానికున్న అభిరుచే దాన్ని ఇంత గొప్పగా తీర్చిదిద్దిందని నా నమ్మకం!"

"హరితకు తారాపథంలోకి దూసుకుపోయే, అవకాశాలు బాగా కనిపిస్తున్నాయి నాకు!... అన్నట్టు ఆ మధ్య ఎవరో ప్రొడ్యూసరు తన సినిమాలో నృత్యప్రధానమైన భూమికను పోషించమని అడిగినట్టు విన్నానే! ఏమైంది?"

"నిజమే! జానకి నా ఫ్రెండు. ఆవిడకి అన్నగారట. జానకి ఇంట్లో అమ్మాయిని చూసి, అమ్మాయికి నాట్యం, సంగీతం వస్తుందని తెలిసి, తను తీయబోయే నృత్య సంగీత ప్రధానమైన సినిమాలో అమ్మాయికి మంచి పాత్ర ఉందని, సరిగ్గా హరితలాంటి అమ్మాయి కోసమే తను గాలిస్తున్నానని అన్నాడట. హరితకు ఇష్టమే అయినా మేమే వద్దన్నాం." చెప్పింది హేమలత.

"అరే! ఎందుకలా చేశారు? హరితకు ఎంతమంచి అవకాశం పోగొట్టారు? మీరు ఒప్పుకొని ఉండాల్సింది. హరిత అందానికి అభినయానికి తారా పథంలో బాగా రాణించగలదనిపిస్తుంది."

"ఏదో సంసారపక్షంగా ఉండే వాళ్ళం. మనకెందుకా సినిమాల గొడవ! ఆ వాతావరణం మనకు సరిపడేది కాదు."

డ్రెస్ మార్చుకుని వచ్చింది హరిత. "వెడదాం, మమ్మీ!" అంటూ.

"ఇంటికి వెళ్ళగానే దిష్టి తీయి!" అని సలహా ఇచ్చింది సుందరి కదులుతూ.

* * *

**హ**రిత తన గదిలో చదువుకొంటూంది!

తల్లి వచ్చి పిలిచింది." కొంచెం ఇలా వస్తావా? ఎవరో పత్రికా విలేకరి... వాళ్ళ పత్రిక కోసం నిన్ను ఇంటర్వ్యూ చేస్తాడట."

"అబ్బా! నేను చదువుకోవాలి, మమ్మీ! నన్ను డిస్టర్బ్ చేయొద్దు! అతడికి కావలసిన వివరాలు నువ్వే చెప్పేసి పంపించు!"

— పోల్కంపల్లి శాంతాదేవి

అని తల్లిని బలవంతంగా పంపించి తను చదువులో నిమగ్నమైపోయింది.

* * *

**వా**రం రోజుల తరువాత ఒకనాడు హరిత కాలేజీకి వెళ్ళగానే స్నేహితులు చుట్టేశారు—ఆమె ఇంటర్వ్యూపడిన పత్రిక చూపుతూ.

"ఇంటర్వ్యూ ఇలా ఇచ్చావేమిటి? చక్కటి గృహిణిగా, మంచి తల్లిగా చక్కగా కాపురం చేసుకోడమే నా జీవితాశయం అని చెప్పావేమిటి? గొప్ప డాన్సరు కావాలనీ, పోస్టుగ్రాడ్యుయేషన్ చేయాలనీ... అది నీ జీవితాశయమని చెప్పేదానివి!" అడిగింది సవిత అనే అమ్మాయి.



"పరీక్షలొస్తున్నాయి కదా... చదువుకోవాలని మా అమ్మకి చెప్పాను... ఆ ఇంటర్వ్యూ సంగతి ఆమెనే చూసుకోమని. అది తెచ్చిన తంటా ఇది!" చెప్పింది హరిత.

అటునుండి అబ్బాయిల గుంపు వెడుతూంది అప్పుడే.

రాజీవ్ అనే అబ్బాయి హరితకేసి చూసి కన్నుగీటుతూ, "నా బిడ్డలకు మంచి తల్లి, నాకు చక్కటి గృహిణికాగల అమ్మాయి కోసమే నా తపన్సురా!" అన్నాడు ప్రక్కనున్న వాడితో.

హరిత ముఖం ఎర్రమందారమైంది.

ఇంకోసారి అయితే చీల్చిచెండాడేదిగాని, ఇప్పుడు తల్లిచేసిన పనికి బోనులోపడిన మృగరాజులా గుర్రుగా చూసింది.

ఇంటికి వస్తూనే తల్లిమీద విరుచుకుపడింది. "ఏమిటి మమ్మీ నువ్వు చేసిన పని? గొప్ప డాన్సరుని కావాలని, పోస్టుగ్రాడ్యుయేషన్ చేయాలని నాకల. కలకాదు... నా ఆశయం! ఆ సంగతి నీకు తెలును. తెలిసీ ఆ పత్రిక ఇంటర్వ్యూలో అలా ఎందుకుచెప్పావు?"

"ఏం చెప్పానే?" హఠాత్తుగా కూతురు విరుచుకుపడుతూంటే అయోమయంగా చూసింది హేమలత.

"చక్కటి గృహిణిగా, మంచి తల్లిగా జీవితం కొనసాగించడమే నా ఆశయమని ఎందుకు చెప్పావు?"

"ఓ! అదా?" హేమలత హాయిగా నవ్వేసింది. "ప్రతి ఆడపిల్లకీ చివరికి జీవిత పరమార్థం అదే కదా! నువ్వు ఎంత చదివినా, ఎంతగొప్ప కళాకారిణివైనా చివరికి గృహిణిగా మారక తప్పదు కదా? ఇవా పిల్లల్ని కనకపోతే అందం, ఆనందం ఏముంది? ఒక్కగానొక్క కూతురివి. నీ భవిష్యత్తు గురించి మేం కనే కల అది! నిన్ను గొప్ప డాన్సరుగా చూడడంకంటే, ముచ్చటైన సంసారం, ముత్యాల్లాంటి బిడ్డలకు తల్లివైనప్పుడే మాకు నిజమైన ఆనందం."

"ఆపాటిదానికి ఈ చదువు, ఈ డాన్సు, ఈ సంగీతం-ఇవన్నీ ఎందుకు?" హరిత ఉక్రోషంగా అడిగింది.

"గొప్ప గొప్ప కళాకారిణులు, బాగా చదువుకొన్నవాళ్ళు పెళ్ళిళ్ళు మానేస్తున్నారా?" ఆశ్చర్యంగా అడిగింది హేమలత. "డాక్టర్లు, యాక్టర్లు, మినిష్టర్లు—అందరూ పెళ్ళిళ్ళు చేసుకొంటున్నారు. పిల్లల్ని కంటున్నారు.వాళ్ళని ఇంటర్వ్యూ చేసి చూడు—ఇల్లుదిద్దుకోవడంలో ఉండే ఆనందం దేనిలోనూ లేదంటారు! భర్తకు తమ చేతుల్తో వండి పెట్టుకోవడం గొప్ప అనుభూతిగా చెబుతారు. ఎంత గొప్ప పదవులు నిర్వహించేవాళ్ళయినా సంసార మాధుర్యాన్ని మించింది లేదని చెబుతారు."

"నేను వివాహానికి వ్యతిరేకిని కాదు. కాని, వివాహం ఆడదాని జీవితంలో ఒక భాగం కావాలిగాని, వివాహమే జీవితం కాకూడదు! వివాహిత అయిన స్త్రీ తన ప్రొఫెషన్ చూసుకొంటూ తీరిక కాలాన్ని గృహసీమను అందంగా మలుచుకోవడంలో తప్పేమీ లేదు! కాని, స్త్రీకి సంసారం తరువాతే ఏదైనా అంటే మాత్రం నేను ఒప్పుకోను."

"నేను మాత్రం సంసారం చక్కదిద్దుకోవడం తరువాతే అంటాను ఏదైనా! సంసారం చట్టబండలు చేసుకొని ఏం చదువులు, ఏం ఉద్యోగాలు, ఏం కళాసేవలు అంటాను!"

"మరీ వేదకాలంలో మాట్లాడాల్సిన మాట ఈ ఇరవయ్యవ శతాబ్దిలో మాట్లాడితే హాస్యాస్పదంగా ఉందిమమ్మీ మనువు ఇంకా చావలేదు! ఈ ఇరవయ్యో శతాబ్దపు స్త్రీలను కూడా గట్టిగా పట్టుకు పరిపాలిస్తున్నాడనిపిస్తుంది. ఇల్లు శుభ్రంగా ఉంచడం, వంటచేయడం, అంట్లు తోమడం, బట్టలుతకడం, మగపిల్లల కోసం, మంచి భర్తకోసం, ముత్తయిదుతనం కోసం నోములు వ్రతాలు చేయడం, దేవతలను ప్రార్థించడం—స్త్రీ ధర్మాలుగా చెప్పాడు మనువు. ఈ ధర్మాలను తు.చ. తప్పకుండా పాటించే నీలాంటి స్త్రీలు ఉన్నంతవరకు స్త్రీ జీవితానికి మోక్షం లేదంటాను" ఆవేశపడిపోయింది హరిత.

"మనువు చెప్పిన ధర్మాలని హేళన చేయకు. మనువు చెప్పినా, ఎవరు చెప్పినా ఆడదానికి ఇల్లు శుభ్రంగా ఉంచుకోవడం, వంటా వార్పు చేసుకోవడం, భర్త పూర్ణాయుర్దాయంతో ఉండాలనుకోవడం, వంశాచారంగా వచ్చే నోములు, వ్రతాలు చేసుకోవడం తప్పెలా అవుతుంది? ఆడవాళ్ళు ఇలా ఉండక ఇంకెలా ఉంటే బాగుంటుందంటావు?" కోపంగా అడిగింది హేమలత.

"ఏం చేసినా పురుషుడిని సుఖపెట్టడం కోసమే నన్న దాస్యభావంతో చేయడంలోనే ఉంది తప్పు! భార్యా భర్త అంటే సంసారంలో చెరిసగం! చెరిసగం అయినప్పుడు ఇంటిపనిపాటలు చెరిసగం కావాలి. ఒక స్త్రీ మాత్రమే తన అమూల్యమైన సమయాన్ని ఇంటి చాకిరీతో వృధా చేసుకోవడం అదేం స్త్రీ ధర్మం?"

"చదివేస్తే వున్న మతిపోయినట్టుగా ఉంది! ఇదేం విపరీత ధోరణి?" విసుక్కుంది హేమలత. "రేపు పెళ్ళయ్యాక ఇలాగే మాట్లాడితే వాడు తంతాడు నిన్ను."

"భార్యలు దాసీలు కావడానికి కారణం, సంపాదన లేకపోవడం, మగవాళ్ళమీద పడి తినడమే, మమ్మీ! అందుకే అలాంటి పరిస్థితి తెచ్చుకొంటున్నందుకు ఆడది సిగ్గుపడాలి. చలం అన్నట్టుగా పిల్లల్ని కనే జంతువులు సైతం తన జంట మీద ఆధారపడడంలేదు! తన బ్రతుకు తను బ్రతికి తన పిల్లల్ని తనే సాక్కుంటుంది. పక్షుల్లో సైతం పోతుపక్షిమీద ఆధారపడడంలేదు పెంటి పక్షి తన ఆహారం తనే సంపాదించుకొంటుంది. పశుపక్షులకంటే హీనాతి హీనమైనదా స్త్రీ జన్మ? మగవాళ్ళమీద ఆధారపడి పరాన్న భుక్కులుగా జీవించడం వల్లే భార్య అంటే ఒకదాసిగా, ఒక ఉంపుడు కత్తెగా చూడబడే స్థితి తెచ్చుకుంది. నేను మాత్రం ఉద్యోగం చేసి నా కాళ్ళమీద నేను నిలబడే వరకు వివాహం చేసుకోను."

"అయితే ఉత్తమ గృహిణులంతా నీ దృష్టిలో ఉత్తదాసీలని, ఉంపుడు కత్తెలనీ అర్థమన్నమాట!" కోపంగా అడిగింది హేమలత.

"అదే, ఉత్తమ గృహిణి, సాధ్వీతిలకం, పతివ్రతా శిరోమణి—ఈ బిరుదుల మీది వ్యామోహమే ఆడదాన్ని ఇంత హీన స్థితికి తెచ్చింది! ఈ వ్యామోహమే తన ఆత్మగౌరవాన్ని ఎక్కడ పోగొట్టుకొంటున్నదీ తెలుసుకోకుండా చేసింది."

"చల్లటి సంసారాలకు ఇంత వికృత రూపం ఇచ్చే ఈ ధోరణి ఇక పెరగనివ్వకు!" మందలిస్తూ అంది హేమలత. "నీపెళ్ళి గురించి నీక్కాబోయే భర్తగురించి ఆలోచించాల్సింది మేము, నువ్వు కాదు! నీపెళ్ళి నువ్వు చేసుకొనేంత పెద్దదానివి అయిపోయావనుకొంటున్నావా?"

"మీ మీద నాకా నమ్మకముంది మమ్మీ! కాని నాది ఒకే ఒక షరతు! నా పెళ్ళికి కట్నప్రసక్తి ఉండకూడదు! పైసా కట్నం తీసుకోనివాడినే నా జీవిత భాగస్వామిగా కోరుకుంటున్నాను! ఇంకొకటి ఏమిటంటే నేను పోస్టుగ్రాడ్యుయేషన్ చేశాకే నా పెళ్ళి జరగాలి!"

ఇప్పుడే ఈ విషయం మీద తర్కం పెట్టుకోదలచలేదు హేమలత. ఒకటి రెండు సంబంధాలు దృష్టిలో ఉన్నా ఇంకా ఎవరినీ కదపడంలేదు—ఈ బి.ఎ అయిపోగానే పెళ్ళి ప్రయత్నాలు మొదలు పెట్టాలనుకొంటున్నారు కాబట్టి. కూతురి పెళ్ళికి కట్న కానుకల కోసమే బాంకులో లక్షరూపాయల వరకూ వేశారు.

ఆ రోజు రాత్రి కూతురికీ తనకూ నడిచిన వాదవివాదం గురించి భర్త కృష్ణారావుతో చెప్పింది హేమలత.

"ఇంతవరకూ పెంచడం ఒకెత్తు, ఇప్పుడొకెత్తు అనిపిస్తూందండీ! దానికి చాలా స్వతంత్ర భావాలు ఏర్పడ్డాయి!"

"వయసొచ్చిన పిల్లలు వ్యక్తిత్వం సంతరించుకోవడం సహజమే కదా? వ్యక్తిత్వమంటేనే స్వతంత్రం!"

"అందుకే, వయసురాకముందే ఆడపిల్లకు పెళ్ళి చేసి పంపాలని అంటారండీ—ఇలా నెత్తికెక్కడానికి తయారవుతారనే!"

"ఆదర్శమూర్తిగా పేరు తెచ్చుకున్న నువ్వేనా ఇలా మాట్లాడేది?" అన్నాడు కృష్ణారావు కొంచెం హాస్యంగా.

"ఏం ఆదర్శంలెండి! ఒక్కగానొక్క పిల్ల! ఆటాపాటా వస్తే ముచ్చటగా ఉంటుందని నాట్యం, సంగీతం నేర్పించాం. ప్రోగ్రాములివ్వమని ప్రోత్సహించాం. ఈ కాలంలో ఆడపిల్లలు చదువుకోకపోతే కష్టమని అందరితోపాటు చదివించాం. ఇప్పుడది మనల్నే ఎదిరించడానికి తయారైతే ఎలా? కట్నం తీసుకొనే అబ్బాయిని పెళ్ళి చేసుకోదట! కట్నం తీసుకోని అబ్బాయిని మనం ఎక్కడ నుండి తీసుకురాగలం?" చిటపటలాడినట్టుగా అంది హేమలత.

"తనే తెచ్చుకొంటుందేమో!"

"తెచ్చు కొంటుంది ఏ కులం కాని వాడినో, మతంకాని వాడినో నా బొందిలో ప్రాణముండగా అలా జరగనివ్వను!"

"మనమ్మాయి మరీ అంత పెద్దది కాలేదని నా నమ్మకం! అనవసరంగా కంగారు పడకు! మంచీ చెడ్డా తెలిసిన పిల్లేకాని బరితెగించిపోయే పిల్ల మాత్రంకాదు!"

"మీ ధైర్యమేమిటో తెలియదుగాని, నాకు మాత్రం హరిత ఒక సమస్యగా తయారవుతుందేమోనని భయంగా ఉంది!"

"ఇన్నాళ్ళు అది ఆటల్లో, పాటల్లో, చదువుల్లో, డిబేట్స్‌లో తెచ్చుకొన్న బహుమతులూ ప్రశంసలూ చూసి మురిశాం, గర్వంతో ఉప్పొంగిపోయాం. ఆ ఆనందానికి బదులు ఇవ్వాల్సే వస్తే మనం వెనకడుగు వేయకూడదంటాను."

"అంటే ఏమిటి అర్థం?"

"హరిత వ్యక్తిత్వాన్ని గౌరవించడం నేర్చుకోవాలంటాను!"

"తండ్రీ కూతురు ఏకమై నన్ను ఏడిపిస్తారా

ఏమిటి?" ఆవిడ భయంగా చూసింది భర్తకేసి.

"భయపడకు! నేను నీ పక్షమే."

• • •

ఆరోజు హరిత కాలేజీ నుండి వచ్చే సరికి పక్కింట్లో ఉండే ప్రమీల అనే ఆమె తల్లితో మాట్లాడుతూ కనిపించింది. హరిత పలకరింపుగా, స్నేహపూర్వకమైన నవ్వు నవ్వి డ్రెస్సు మార్చుకోడానికి గదిలోకి వెళ్ళింది.

"ఏ రాత్రో లేచి చెప్పకుండా పారిపోదామనిపిస్తుంది పిన్నిగారూ! ఎక్కడికి వెళ్ళాలి? పుట్టిల్లు ఉన్నా వెళ్ళలేను. పెళ్ళి చేసి నన్ను అత్తారింటికి పంపి పుట్టెడు అప్పుల్లో మునిగిపోయారు. మునిగిపోయినా, పిల్లను ఓ ఇంటిదాన్ని చేశామన్న తృప్తితో ఉన్నారువాళ్ళు. నేను వెళ్ళి, నా బాధలన్నీ ఏకరువు పెట్టి వాళ్ళ మనశ్శాంతి చెడగొట్టలేను! చెడగొట్టినా ఎన్నాళ్ళో భరించలేరు నన్ను వాళ్ళు! ఇంకా పెళ్ళి కావలసిన పిల్లలున్నారు! మా నాన్నది బొటాబొటి సంపాదన. అన్నయ్య అయిదేళ్ళనుండీ నిరుద్యోగిగా ఉన్నాడు... ఇక్కడే, ఈ రాక్షసుల చేతుల్లో చావడం తప్పితే నాకింకేమీ దారి కనిపించడంలేదు!" కన్నీటితో వాపోయింది ప్రమీల.

"ధైర్యంతో పరిస్థితిని ఎదుర్కోవడానికి ప్రయత్నించాలి గాని అధైర్యపడితే ఎలా?" ఊరడింపుగా అంది హేమలత.

"ధైర్యం తెచ్చుకోడానికి నాకేముందని?"

"ఎంతవరకు చదివావు?"

"ఎస్సెస్సీ. పెద్ద పెద్ద డిగ్రీలున్నవాళ్ళకే ఉద్యోగాలు లేవు. నాకెవరిస్తారు?"

'ఆడదానికి అత్తవారిల్లు యమచర అయినప్పుడు ఉద్యోగం ఒక్కటే పరిష్కారం అవుతుందా? ఆడదానికి తన బ్రతుకు తను బ్రతకడం ఒక్కటే ముఖ్యం కాదు. భర్త, అత్తవారిల్లు వున్న తీరు వేరు. పెళ్ళయిన పిల్ల ఏకాకి జీవితం గడపడం ఎంత ప్రమాదం? ఎంత దుర్భరం?' అని ఆలోచించిన హేమలత నువ్వు కొంచెం ఓపికపట్టాలి, ప్రమీలా! ఇప్పుడు నీ భర్తను ఉసిగొల్పే మీ అత్తగారు ఎల్లకాలమూ ఉండబోదు! నీకంటూ ఒక సంసారం నెమ్మదిగా ఏర్పడుతుంది. నీకు పెళ్ళయ్యి ఏడాదేగా అయింది! ఒకరిద్దరు పిల్లలు పుడితే నీ భర్తలో తప్పకుండా మార్పు వస్తుంది! నా పిల్లలూ, నా భార్య అన్న మమకారం కొంతమంది మగవాళ్ళలో పిల్లలు పుట్టాకే ఏర్పడుతూంటుంది!"

"ఈ నరకంలో నేను పిల్లలకి జన్మనివ్వడం కూడానా? వద్దండీ!"

"కరెక్ట్, ప్రమీలగారూ!" అంటూ వచ్చి కూర్చుంది హరిత. "మీ ఆలోచన సరైంది! మీ బ్రతుకే మీకు బరువు కాగా మరో జీవిని ప్రపంచంలోకి ఆహ్వానించి ఆ జీవి బ్రతుకు భారం చేయొద్దు. ఆడపిల్లే పుడితే ఆమె బ్రతుకూ, మీ బ్రతుకూ మరీ ఘోరంగా తయారవుతుంది!"

"నీదంతా అనుభవం లేని మాటలు, హరీ! పిల్లలు పుడితే మగవాళ్ళు తప్పక మారుతారు. అలా మారిన మగవాళ్ళని నేను చాలా మందిని చూశాను!" అంది హేమలత.

"మారడం సంగతి దేవుడెరుగు! కాని, కన్న పిల్లల ముందే భర్తచేత తన్నులు తినాల్సి వస్తే అప్పుడామె పరిస్థితి ఎంత అసహ్యంగా ఉంటుందో చూడు!"

"నీ చాదస్తం కాని, మగవాళ్ళు ఎప్పటికీ ఒకలాగే ఉంటారా? నువ్వు అనవసరంగా ఏదేదో ఊహించి ఆ అమ్మాయి మనసు చెడగొడుతున్నావు! పెళ్ళయిన కొత్తలో మా పెదబావగారు మా అక్కయ్యని చీటికి మాటికి కొట్టేవాడు. కొడుక్కి తండ్రికాగానే పెద్దమనిషి తరహా వచ్చేసింది. కొడుకంటే వల్ల మాలిన ప్రేమ చూపేవాడు భర్తగారి ఆ బలహీనత కనిపెట్టి 'నామీద చెయ్యెత్తారా, వాడిని నూతిలో పడేసి నేనూ పడతాను!' అన్న బెదురు పెట్టింది మా అక్కయ్య. అంతే కొడుకుతోపాటు భార్యనూ అపురూపంగా చూసుకోవడం మొదలుపెట్టారు మా బావగారు."

"నిజంగా, నాకే కొడుకు పుట్టి నేను ఆ బెదురు పెట్టబోయాననుకోండి. 'అంతశ్రమనీకెందుకే? నేనే ఆ పని చేసి నీకాశ్రమ తప్పిస్తాను" అంటూ ఆయనే నూతిలోకి తోస్తారు నన్నూ నా బిడ్డనూ. అలాంటి కర్కోటకుడు పిల్లలు పుడితే మారతాడని నేను నమ్మను!" అంది ప్రమీల.

"పిల్లలు పుట్టకుండా జాగ్రత్త తీసుకొంటున్నావా ఏమిటి?" హేమలత అనుమానంగా అడిగింది.

"అదేం లేదండీ! కాని, నెలతప్పినట్టుగానే నా అనుమానం. మొన్న ఎనిమిదికే నెల. వారం రోజులు గడిచాయి."

"నిజంగా నెల తప్పితే పోగొట్టుకోవాలని చూడకు! నీకు పుట్టబోయే బిడ్డ నీ జీవితంలో మార్పు తెస్తుందని నమ్ము."

"నువ్వామెకు వట్టి చాదస్తం నూరిపోస్తున్నావమ్మా! తాదూర కంతలేదు మెడకో డోలు అన్న సామెతగా ఆమెకు పిల్లల్ని కనమని సలహా ఇస్తున్నావు!"

"నీకు తెలియదు! నువ్వూరుకో, హరీ!"

"మీ సలహా ఏమిటి, హరితా?" అడిగింది ప్రమీల.

ప్రమీలకు ఏడాది క్రితం పెళ్ళయ్యి కాపురానికి వచ్చిందని, భర్త టీచరుగా చేస్తున్నాడని, అతడు తరచూ ప్రమీలను కొడుతూంటాడని, అత్తగారు అంత మంచి మనిషికాదని, ఆవిడ ఏవేవో చాడీలు చెప్పి ప్రమీల మీదికి ఉసిగొల్పుతుంటుందని మాత్రం తెలుసు హరితకు.

"అసలు మీ భార్యా భర్తల మధ్య పోట్లాట ఎందుకు వస్తుందో ముందు నాకు చెప్పండి ప్రమీలగారూ." అడిగింది హరిత.

"అసలు, నేను నోరెత్తితే కదా, అది పోట్లాట అయ్యేది? నా నోరు ఎప్పుడూ మూతపడేవుంటుంది. నా నోరూ ఆయనే పెట్టుకుని అరుస్తుంటాడు! కొడుతుంటాడు! ఆయన చొక్కా సరిగ్గా ఉతక్కపోతే దెబ్బలు! వంటల్లో సరిగా ఉప్పు కారం వేయకపోతే దెబ్బలు! ఆయన వచ్చే సమయానికి గుమ్మంలో నిలబడితే దెబ్బలు! ఎప్పుడైనా సహనం చచ్చి ఏమైనా అంటే చావుదెబ్బలు! ఇంత కోపమూ ఎందుకంటే, పెళ్ళిలో అలుకపాన్పు మీద మా నాన్నగారు ఇస్తానన్న టూ-ఇన్-వన్ ఇవ్వలేదని, పెళ్ళిలో ఇంకేవో మర్యాదలు సరిగా జరగలేదని! మామేనత్త ఒకామె ముస్లింను ప్రేమించి అతడితో వెళ్ళిపోయి పెళ్ళి చేసుకొంది. పెళ్ళయ్యాక ఆ సంగతి తెలియడంతో మాది మంచి వంశంకాదని, ఎరక్కపోయి గోతిలో పడ్డామని ఎప్పుడూ దెప్పుతూ ఉంటుంది మా అత్తగారు. పెళ్ళిలో వియ్యపురాలికి పెట్టే చీర నాసిరకంది పెట్టామని, తన ఒక్కగా నొక్క కూతురికి ఆడపడుచు లాంఛనాలు సరిగా ఇవ్వలేదని ఇలా ఏదో ఒకటి అక్కసు వెళ్ళబోస్తూ ఉంటుంది!"

"అయితే మీది కట్నపు వేధింపు కేసన్నమాట! ఇలా కట్నకానుకల కోసం వేధిస్తున్నాడని అతడిమీద చర్యతీసుకోవచ్చు! శిక్షపడేట్టు చేయవచ్చు!"

"ఎవరుచేస్తారు?"

"ప్రభుత్వమే చట్టంద్వారా చర్య తీసుకొంటుంది. మీరు కోర్టులోగాని, పోలీసు స్టేషన్‌లో గాని ఫిర్యాదు చేయాలి! మీలాటి వాళ్ళకోసమే సి.బి.సి.ఐ.డి.లో మహిళా సంరక్షక విభాగం ఏర్పరచారు."

"చేస్తే ఏం జరుగుతుంది?"

"అతడికి వార్నింగ్ ఇవ్వడం జరుగుతుంది. అక్కడికీ బుద్ధి రాకపోతే ఉద్యోగం ఊడగొట్టి జైలుశిక్షగాని, జరిమానాగాని వేయవచ్చు."

"కాని, నాకు జరిగే న్యాయమేమిటో అర్థం కావడంలేదు!"

"అరే! మీకు న్యాయం ఎందుకు జరగదు. మిమ్మల్ని హింసించడంవల్ల తన ఉద్యోగపోతుందనో, జైలుశిక్షపడుతుందనో భయం ఉంటే మీ జోలికి రాడు కదా?"

"నన్ను కొట్టకపోవచ్చు... కానీ, ఇలా చేశానని నామీద కక్షపెరిగిపోతుంది. అదను చూసుకొని కాలనాగులా కాటు వేయడానికి సిద్ధపడితే?"

"అప్పుడతడికోసం ఉరిత్రాడు సిద్ధంగా ఉంటుందన్న నిజం అతడికి తెలియజేయాలి!"

"కాని, హరితా!" శుష్కహాసం చేసింది ప్రమీల. "గుమ్మంలో నిలబడితేనే చావు దెబ్బలు తినే నేను గుమ్మందాటి ఏ కోర్టుకు వెళ్ళి ఫిర్యాదు చేయగలనా? ఏ పోలీసుస్టేషనుకు వెళ్ళి చెప్పుకోగలను నా బాధ? మహిళలమీద జరిగే అత్యాచారాల విచారణ కోసం ప్రత్యేక కోర్టులూ, ప్రత్యేకపోలీసు స్టేషన్లూ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నదిగాని నాలాంటి అబలలకు న్యాయం ఎంత దగ్గరిగా రావాలనుకొంటే మేం అంత దూరమైపోతున్నాం కదా? ఆయనే ఉంటే మంగలాడెందుకన్నట్టు ఎవరి దగ్గరికో వెళ్ళి ఫిర్యాదు చేసుకోగల ధీమానే ఉంటే ఇంట్లో ఆయనచేత గొడ్డులా ఎందుకు తన్నులు తింటాను? ఏం చేస్తే ఆయనకి కోపంవస్తుందో? ఏం అంటే ఆయనకి కోపం పెరుగుతుందో అని ఎప్పుడూ హడలిపోయే నేను, కోర్టులకూ, పోలీసు స్టేషన్లకూ వెళ్ళగలనా? అసలు, మనిషిలో మార్పు వస్తే సుఖపడగలనుగాని, అతడిని బెదిరించి అదిలించి చేసే కాపురం కాపురమవుతుందా?"

"ఇలా అధైర్యపడే, ఇలా నీరసపడే పురుషుడి దౌష్ట్యానికి బలైపోతున్నారండీ మీలాంటివాళ్ళు! మీలాంటి నిస్సహాయులకోసమే ప్రత్యేక న్యాయస్థానాలూ, పోలీసు స్టేషన్లూ ఏర్పరచింది ప్రభుత్వం. వాటిని ఉపయోగించుకోకపోతే ఎలా? భర్తపెట్టే, అత్తపెట్టే చిత్రహింసని మూగగా భరించే రోజులు పోవాలండీ... దెబ్బకు దెయ్యం జడుస్తుంది. కోర్టు భయం, పోలీసుల భయమూ ఉంటే మనిషి దారికి రాక ఏమౌతాడు?"

"నీకు తెలీదు, హరీ! ఆలుమగలమధ్య వ్యవహారం చాలా సున్నితంగా ఉంటుంది. ముందే కిరాతకుడు... ఇంకా బయటికి వెళ్ళి ఫిర్యాదు చేస్తే మరీ రెచ్చిపోడూ?

ఆ కోపానికి ఆహుతి అయ్యేది ప్రమీలే కదా? నువ్వు ఇలాంటి సలహా ఇవ్వడం బాగా లేదు!" హేమలత కూతుర్ని మందలించింది.

"పిల్లల్ని కనమన్న నీ సలహాకంటే, ఓపికపడితే అన్నీ సర్దుకొంటాయన్న నీ సలహాకంటే నేను మంచి సలహానే ఇచ్చాననుకొంటున్నాను. కోర్టులకు, పోలీసుల దగ్గరికెళ్ళే ధైర్యంలేకపోతే సరే... సిటీలో డౌరి డెత్ కమిటీ ఉందికదా? వెళ్ళి వాళ్ళ సహాయం అర్థిస్తే బాగుంటుంది."

"వాళ్ళెవరితోనూ నాకు పరిచయంలేదు. ఎలా వెళ్ళి నా కష్టసుఖాలు చెప్పుకోవాలి?"

"దీనికి పరిచయమెందుకు? మీలాంటి వాళ్ళకోసమే ఆ కమిటీ ఏర్పడింది. దాన్ని ఉపయోగించుకోవాల్సిన బాధ్యత మీలాంటి వాళ్ళది! ఒక్కరూ పోలేరనుకొంటే నేను వెంటబెట్టుకు వెడతాను మిమ్మల్ని!"

"మీరు సాయం వస్తానంటే వస్తాను!" ఆశగా అంది ప్రమీల. "కాని, ఈ కారణంగా ఇంట్లో ఏం గొడవ బయల్దేరుతుందోనని భయంగా ఉంది!"

"గొడవలన్నీ సర్దుకోవాలనే కదా ఈ ప్రయత్నం!"

"ఎప్పుడు వెడదాం?"

"నా ఫ్రెండు ఒకామె డౌరీడెత్ కమిటీలో వర్క్ చేస్తోంది. ఆమెకు ఫోన్‌చేసి ఎప్పుడు మనం వెళ్ళాల్సిందీ చెబుతాను!"

"ప్రమీలా, ఇక్కడున్నావా? ఎక్కడికి వెళ్ళావోనని వెదికి వెదికి చస్తున్నాను. వాడొచ్చే వేళయింది. వాడొచ్చేసరికి నువ్వు ఇంట్లో లేకపోతే ఎగురుతాడు. ఎందుకు అనవసరంగా వాడికి కోపం తెప్పించడం? పద!" అంది ప్రమీల అత్తగారు వచ్చి. ఈవిడేనా కోడలు మీద చాడీలు చెప్పి కొడుకు చేత తన్నించేది అని ఆశ్చర్యం కలుగుతుంది ఆవిణ్ణి చూస్తే.

ప్రమీల వెళ్ళిపోగానే—

"నువ్వు జోక్యం చేసుకోవడం నాకేమీ నచ్చలేదు, హరి! నువ్వు చేస్తున్న పనికి ఆమె కాపురం ఇంకా చిక్కులకు గురి అవుతుందిగాని, సమస్యలను పరిష్కరించదు!" అంది హేమలత కూతుర్ని చీవాట్లు పెడుతూ.

"ఎవరి భయమూ లేక కుందేలు పిల్లమీద సింహంలా దూకుతున్నాడమ్మా ప్రమీల భర్త—మహిళా మండలి కార్యకర్తలను రంగంలోకి దింపి అతడిని ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు త్రాగించకపోతేచూడు!"

"అదే నీకెందుకు, లేని పోని గొడవ అంటున్నాను."

"అదేం మాట, మమ్మీ? మనం సంఘజీవులం... సమాజంలో ఉంటున్నాం. సమాజం అవసరం మనకెంత ఉంటుందో, సమాజానికి మన అవసరం అంతే ఉంటుంది... పొరుగున ఒక అత్తింటి కోడలు అరడిపడుతుంటే భర్తదౌష్ట్యానికి బలైపోతుంటే సంఘజీవిగా మన బాధ్యత ఏమిటి?

"ఆలుమగల మధ్య తగాదా చాలా సున్నితమైనది! అది వాళ్ళకి వాళ్ళే సర్దుకోవాలిగాని ఇతరుల జోక్యం వల్ల ఇంకా దెబ్బతింటుంది వాళ్ళమధ్య సంబంధం."

"ఇప్పుడు వాళ్ళమధ్య ఉన్న సంబంధం కటికవాడు, గొర్రెపిల్ల మధ్య ఉండే సంబంధంలాంటిది! ఇది ఉండడంకంటే పోవడమే మేలంటాను. ఆడదాన్ని సుఖశాంతులతో బ్రతకనీయనప్పుడు ఆ కాపురం ఎందుకు? కూలిపోతేనే ప్రమీల బ్రతికిపోతుంది!"

"అయ్య! చేజేతులా తమ సంసారాన్ని కూల్చివేసుకొంటారా ఎవరైనా? ఏనాటికో ఒకనాటికి చక్కబడుతుందన్న ఆశ, సహనం ఉండాలిగాని కూల్చివేసుకొంటే ఏం మిగులుతుంది? తలిదండ్రులా ఇంట అడుగు పెట్టనివ్వరు! అప్పుడు రోడ్డేగా గతి? ఆడది వీధిపాలుకావడం కంటె చావడమే మేలుకదా?"

"ఎందుకు మమ్మీ ఇంత సంకుచితంగా మాట్లాడతావు? ఆడది పెళ్ళికి ముందు తలిదండ్రుల నీడన, పెళ్ళయ్యాక భర్త నీడన తప్ప మరో విధంగా బ్రతకడం విధిన పడడంగా ఎందుకు భావించాలి? తన కష్టం తను పడుతుంది... తన బ్రతుకు తను బ్రతుకుతుంది! తన నీడ తను ఏర్పరుచుకొంటుంది."

"ప్రమీల ఏం పెద్ద చదువు చదివిందని ఉద్యోగం వస్తుంది?"

"ఉద్యోగం రాకపోవచ్చు! ఇప్పుడు భర్త అన్న కటికవాడికి, అత్త అన్న రాక్షసికి గొడ్డు చాకిరీ చేయడంలేదూ? అదే చాకిరి ఇంకెవరి దగ్గరైనా చేసి దాన్నే సంపాదనగా మార్చు కొంటుంది!"

"బాగుందే నీ ఆలోచన! ఎవరింట్లోనో పాచిపని చేసి బ్రతకడం కంటే భర్త నీడన ఉంటే గుట్టుగా, గౌరవంగా ఉండదూ?"

"క్షణ క్షణం నరకం కన్పిస్తూ, దాసి కంటే, కుక్క కంటే హీనంగా చూస్తూ తంతూ, తిడుతూ ఉండే భర్త నీడ


"మెరి"...మిరిమిట్లు గొలిపే ప్రపంచ ప్రసిద్ధిపొందిన 22ct. గోల్డు కవరింగు నగలు!

తరములకు తారవంటిది! అందాన్ని అధికమించేది, అందరిని ఆకర్షించేది, గ్యారంటీతో ఎనలేని డిజైన్లులతో మురిపించేది. అందులో మీకు కావలసిన నగల నెంబర్లు గుర్తించండి. ఆ నగలు మీకు పంపబడును. వి. పి. పి. చార్జీలు ఎక్స్ట్రా. క్యాటలాగు ఉచితముగా పంపబడును. వెంటనే వివరములకు వ్రాయండి.




MERI GOLD COVERING WORKS
P.O. BOX : 1405, 14, RANGANATHAN STREET, T. NAGAR, MADRAS-600 017.

గౌరవమూ, తనరెక్కల కష్టంమీద తను బ్రతకడం అగౌరవమూనా? నీ ఆలోచనా దృక్పథంలోనూ, దాదాపుగా నీ మాదిరిగా ఆలోచించే ఈ సమాజ దృక్పథంలోనూ మార్పు వస్తే తప్ప ప్రమీలలాంటి పీడితులు బ్రతికిపోరమ్మా! స్త్రీ భార్యగా, కూతురిగా బ్రతకడం కంటే వ్యక్తిగా జీవించడం గొప్ప విషయంగా భావిస్తాను. అభ్యుదయ వాదులంతా ఇదే భావిస్తారు!"

"సరే! ఎవరింట్లోనో ఎంగిలి కంచాలు కడిగో, వీధులూడ్చే తన బ్రతుకు తను బ్రతుకుతుంది. తరువాత?"

"తరువాతేముంది?"

"నిండా ఇరవయ్యేళ్ళులేని పిల్ల! ప్రపంచ ధర్మాల్నీ కాదని, శరీరధర్మాన్ని కాదని ఎలా బ్రతుకుతుందో నాకు అర్థంకావడంలేదు!"

"అదా?" అప్పటికి అర్థమైంది తల్లి భావం. తేలిగ్గా అంది. "ఒంటరిగా ఉండలేననుకొన్నప్పుడు తనకు తగిన వాడిని చూసి తను పెళ్ళిచేసుకొంటుంది!"

"నీ అభ్యుదయం ఏడ్చినట్లుంది... ఇదా స్త్రీ అభ్యుదయం? ఈ మగవాడు కాకపోతే ఇంకో మగడని మగవాళ్ళవెంట పడడమేనా స్త్రీ జనాభ్యుదయం? అభ్యుదయం కాదే ఇది! స్త్రీ పతనావస్థ! పవిత్రమైన మన వివాహ వ్యవస్థను కించపరుస్తూ సాగే నీ ఆలోచనలను ఇక పెరగనివ్వకు! నేను సహించలేను!"

తల్లికి ఎంత కోపం వచ్చినా తన అభిప్రాయాన్ని చెప్పడానికి జంకలేదు హరిత. "ఈ వివాహ వ్యవస్థను చూసి మరీ అంత గర్వంతో పొంగిపోకమ్మా! మీరనుకొనే పరమపవిత్రమైన ఈ వివాహవ్యవస్థే కట్నంపేరుతో ఎందరినో బలితీసుకొంటూంది. ఎందరినో కాల్చి చంపుతూంది. ఇంకెందరినో కాల్చుకొనేట్టు చేస్తోంది. ఎందరినో గొంతు పిసికి, నూతిలోకి త్రోసి చంపుతోంది. కొందరికి మాత్రమే స్వర్గమైతే చాలామందికి నరకమౌతోంది! పవిత్రత అన్నది మనిషిలో ఉండాలిగాని, వివాహంలో కాదు! మనిషి పవిత్రుడైనప్పుడు వివాహమే కాదు. ఏదైనా పవిత్రమే అవుతుంది!"

"హరీ! నిన్ను చూస్తే నాకు భయం వేస్తూందే! నువ్వు... నువ్వు తల్లిదండ్రుల గుండెల్లో కుంపటిగా మారవు కదా!" హేమలత కూతురి ముఖంలోకి భీతావహంగా చూసింది.

"నన్ను అర్థంచేసుకొని నాకు సరిపోయిన వ్యక్తితో వివాహం జరిపిస్తే అలా ఎందుకు జరుగుతుంది మమ్మీ."

"సరిపోయిన వ్యక్తి అని ముందుగా ఎలా తెలుస్తుంది...?"

"అదే కదా వచ్చిన చిక్కు! సంప్రదాయబంధంలో చిక్కుకొన్న ఆడపిల్ల తనకొచ్చే మగడు ఎలాంటి వాడవుతాడో తెలుసుకోలేకపోతోంది. ప్రేమ వివాహాల వల్ల ఆ ప్రమాదం అంత ఉండదు. కాని, ఎంతమంది తమ పిల్లలకి ఆ స్వేచ్ఛ ఇస్తున్నారు?"

"ఎవరిచ్చినా, ఇవ్వకపోయినా నేను మాత్రం ఆ స్వేచ్ఛ నీకివ్వను! అది బాగా గుర్తు పెట్టుకో!" హేమలత లేచింది.

ఆ రాత్రి మళ్ళీ భర్తతో కూతురు గురించిన భయమే వెల్లడించింది. "దాని ఆలోచనలు చాలా వికృతంగా సాగుతున్నాయండీ! అది ముదిరిపోకముందే దాన్ని ఒక అయ్య చేతిలో పెడితే బ్రతికిపోతాం. ఈ వేసవిలో దాని పెళ్ళి చేసేద్దాం. ఇప్పటి నుండి సంబంధాలు వెదికితే అప్పటికి కుదురుతుంది!"

"నీ ఆలోచన చాలా దారుణమనిపిస్తోంది హేమా! పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేయాలని దాని ప్రగాఢమైన కోరిక! ఇంకొక్క రెండేళ్ళు ఓపిక పడితే దాని చదువు అయిపోతుంది. అప్పుడది అభ్యంతరపెట్టడానికేమీ ఉండదు" అన్నాడు కృష్ణారావు.

"ఈ రెండేళ్ళలో తొండముదిరి ఊసరవెల్లి అవుతుంది. మనం నెత్తీనోరూ కొట్టుకొని ఏడవాలి!"

"ఏం కాదు... అప్పుడు దాని ఆలోచనలకు ఒక పరిపక్వత వస్తుంది. ఇప్పుడున్న తెలిసీ తెలియని మాటలు అప్పుడుండవు. నువ్వు అనవసరంగా కంగారు పడి నన్ను కంగారు పెట్టకు!" అన్నాడు కృష్ణారావు. "మన పెంపకం మీద నాకా నమ్మకం ఉంది... హరిత తలిదండ్రులను అవమానించేట్టు ఎప్పుడూ ప్రవర్తించదు."

"ఇక మీ ఇష్టం. ఈ విషయం మీద ఇంకెప్పుడూ మాట్లాడను!" హేమలత మూతి ముడుచుకొంది.

* * *

హరితకు పరిచయమున్న డౌరీ డెల్ కమిటీ మెంబరును కలిసి వస్తున్నారు హరితా, ప్రమీలా—

"ప్రక్కింటమ్మాయితో కలిసి వెళ్ళి గాజులు తెచ్చుకొంటాను అని చెప్పివచ్చాను, ఇంట్లో. ఇక్కడెక్కడైనా గాజుల షాపుందా?" అనడిగింది ప్రమీల.

"ఉంది."

గాజుల షాపులోంచి ఇద్దరూ బయటికి వస్తూంటే ప్రమీల భర్త లక్ష్మీకాంతం వీళ్ళవంకే అనుమానంగా చూస్తూ కనిపించాడు.

ప్రమీల గుండెలో రాయిపడ్డట్టుగా అయింది.

"ఇప్పుడెలా హరితా? ఇంతసేపూ ఎక్కడికెళ్ళావని నిలదీస్తాడేమో!"

"హరిత పనిమీద కోటీవరకు వెళ్ళొచ్చామని చెప్పలేవూ!"

"చెప్పినా నమ్మడు! వట్టి అనుమానం మనిషి!"

"ఇంకెంత? నాలుగు రోజులు ఓపికపట్టు! డౌరీడెల్ కమిటీ మెంబర్లంతా కలిసి వచ్చి అదరగొట్టిపోతారు! పులిలాంటి మనిషి పిల్లికాకపోతే చూడు!"

"ఇలాంటి బెదిరింపులతో నా సంసారం చక్కబడుతుందన్న నమ్మకం నాకెందుకో కలగడంలేదు."

"ఈ నీరసమూ, నిస్పృహే మీలోంచి పోవాలండీ! 'నా ఖర్మ ఇది! భరించకతప్పదు!' అనుకొన్నంతకాలం మీ మీద పురుషాధి దౌష్ట్యం సాగుతూనే ఉంటుంది. మూగగా ఇంకెంత కాలంకుమిలిపోతారు... తిరగబడి చూడండి! ముందు చైతన్యం, తెగువ మీలో రావాలండీ. అదే మీలో లోపిస్తే ఈ కమిటీ మెంబర్లుగాని, ఇంకెవరైనా గాని మీ కోసం ఏమీ చేయలేరు. మీ సహకారం లేకుండా వాళ్ళు ఏమీ చేయలేరు!"

కాని, మరునాడు హరిత ఊహించనిదే జరిగింది.

హరిత కాలేజీనుండి రాగానే తల్లి చెప్పింది, ప్రమీల పుట్టింటికి వెళ్ళిపోయిందని.

"అరే... ఇంత హఠాత్తుగా! వాళ్ళ వాళ్ళు ఎవరైనా వచ్చి తీసికెళ్ళారా?" ఆశ్చర్యంగా అడిగింది హరిత.

"నువ్వు చేసిన నిర్వాక ఫలం! రాత్రి ఆ అమ్మాయిని అనుమానంతో చావగొట్టాడట అతను—'గాజులు కొంటానని చెప్పింది వట్టి అబద్ధం! నిజంగా ప్రక్కింటమ్మాయితో కలిసి ఎక్కడికెళ్ళావో చెప్పు' అని ఒకటే తన్నులూ, గుద్దులూనట! ఎంత కిరాతకుడో పచ్చిపుండు చేశాడు ఆ అమ్మాయిని! 'ఈ కాపురం నావల్లకాదండీ!' అని ఏడుస్తూ వెళ్ళిపోయింది పాపం!"

"వచ్చే ఆదివారం డౌరీడెల్ కమిటీ వాళ్ళు వచ్చి మాట్లాడడానికి అన్ని ఏర్పాట్లూ చేసివచ్చానే! ఈ ఒక్కసారికీ ఓర్చుకోకపోయిందా!" హరిత నిరాశగా అంది.

"అది అదిలింపులతో, బెదిరింపులతో చక్కబడే సంసారం కాదని ఎప్పుడో చెప్పాను!"

"ఇలా తెగదెంపులు చేసుకోవడమో, లేక ఉండి నిత్యం అతడి చేతిలో తన్నులు తినడమో తప్ప ప్రమీల లాంటివాళ్ళు మరో విధంగా బ్రతికే అవకాశం లేదంటావా, మమ్మీ?"

"ప్రమీల భర్తలాంటి పురుష దురహంకారుల చేతిలో పడ్డ స్త్రీలగతి దిన దినం కన్నీటి మయం తప్ప ఇంకేముంటుంది జీవితం?"

"ఆ పురుష దురహంకారమే కూల్చి ప్రమీల లాంటి స్త్రీలు మరో విధంగా జీవించేలా చేయాలనేనమ్మా నేటి స్త్రీ సంస్కరణవాదుల తాపత్రయం! వాళ్ళు ఏదో చేసే అవకాశాన్ని ప్రమీల లాంటి వాళ్ళు కల్పించాలిగాని నా ఖర్మ అని పారిపోతే ఎలా?"

"మాటలు వేరు! జీవితం వేరు! నీకింకా అర్థమయ్యే వయసురాలేదు!"

* * *

దాదాపు ఎనిమిదినెలలు గడిచిపోయాక, ఒకరోజు—

హరిత కాలేజీకి సెలవు కావడం వల్ల ఇంట్లోనే ఉంది.

సుమారు ఏభై సంవత్సరాలున్న ఒకామె గుమ్మందగ్గర సంకోచంగా ఆగిపోయి కనిపించింది.

హరిత లేచివస్తూ, "ఎవరు కావాలి?" అని అడిగింది.

ఆవిడ గొంతు పెగల్చుకొంటూ, "నేను... ప్రమీల తల్లిని" అంది.

"అలాగా? లోపలికి రండి!" ఆవిడ లోపలికి వచ్చి కుర్చీలో కూర్చోవడానికి సంకోచపడుతూంటే, "ఫర్వాలేదు! కూర్చోండి! అమ్మను పిలుస్తాను!" అని, లోపలికి వచ్చి "ప్రమీల అమ్మగారట వచ్చారు!" అనిచెప్పింది తల్లితో.

చేస్తున్న పని ఆపేసి చేతులు తుడుచుకొంటూ వచ్చింది హేమలత. "ప్రమీలని తీసుకు వచ్చారా?" అంది.

"అవునమ్మా! పిల్లకి బారసాల చేసి నెలలోపలే తీసుకు వచ్చాను!"

"ఎవరి పిల్ల?"

"ప్రమీలకి కూతురు పుట్టిందమ్మా! పిల్లనికాపురానికి పంపుతారా, వేరే పెళ్ళిచేసుకోనా' అని అల్లుడుగారు బెదిరించడం ఎక్కువైపోవడంతో వచ్చి బాలింత అయినా తీసుకురాక తప్పలేదు!"

[ముగింపు వచ్చే సంచికలో]